క్లుప్తంగా

రేపు ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్ : ఎన్నికల హామీ మేరకు ఉచిత ఇసుక విధానం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం వల్ల భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించేందుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు, నిర్మాణ రంగాల యజమానులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని తెలిపారు.

ఉపకార వేతనాల పంపిణీ



మంగళగిరి: పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో ఉన్న అంజుమన్ కార్యాలయంలో బుధవారం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. 650 మందికి రూ.6 లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు షారుక్ షబ్లీ హాజరై, మాట్లాడుతూ ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఇస్లామిక్ ఫ్రంట్ కన్వీనర్ షేక్ అక్రమ్ మాట్లాడుతూ అంజుమన్ ట్రస్ట్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముస్లిం యువతరం కన్వీనర్ ఇక్బాల్ అహ్మద్, హైకోర్టు న్యాయవాది షేక్ రియాజ్, ఖిద్మత్ బ్యాంక్ జిల్లా డైరెక్టర్ షేక్ రియాజ్ పాల్గొన్నారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ త్రిపుర తాండవేశ్వరస్వామి ఆలయం, గంగానమ్మ, వీరభద్రస్వామి, సీతానగరం విజయకీలాద్రి పర్వతంపై, మహానాడు ప్రాంతం, నులకపేట, బ్రహ్మానందపురం, తాడేపల్లి రూరల్‌లో చిర్రావూరు, గుండిమెడ, మెల్లెంపూడి, కొలనుకొండ, ఉండవల్లి, పెనుమాక, పలు అమ్మవారి దేవాలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం నుంచి 9 రోజులు భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు, కమిటీ సభ్యులు తెలియజేశారు.

నేడు మూలాంకురేశ్వరి ఆలయంలో నవరాత్రులు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి ఆలయంలో గురువారం నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు ఆలయ అర్చకులు గడియారం అయ్యన్నశాస్త్రి , ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బత్తుల వేణుగోపాల బాబు సంయుక్తంగా బుధవారం తెలిపారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, శ్రీచక్రానికి ఖడ్గమాల పూజ, అమ్మవారిని బాల త్రిపురసుందరిగా అలంకరించి అష్టోత్తర, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహిస్తామని చెప్పారు. 5న గాయత్రీదేవిగా, 6న అన్నపూర్ణగా, 7న లలితా త్రిపురసుందరిగా, 8న మహా చండీదేవి రూపంలో, 9న మహాలక్ష్మీగా, 10న సరస్వతీదేవిగా, 11న దుర్గామాతగా, 12న మహిషాసురమర్ధనిగా, 13న రాజరాజేశ్వరిదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఫిరంగిపురం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ మేడాబాబు గ్రామంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ప్రజలు ఇటువంటి సభలు వినియోగించుకొని తమ సమస్యలు తెలియజేయాలని కోరారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని సర్పంచ్ హామి ఇచ్చారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి కె. విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న వారిని బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించగా.. పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 25 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మహాత్మకు మహా నివాళి

- వాడ వాడలా మోహన్ దాస్ కరం చంద్ గాంధీ జయంతి
- జాతిపిత శాంతి, అహింసా మార్గాలను అనుసరించాలని నివాళి
- స్వాతంత్య్రోద్యమంలో బాపూజీ పోరాట పటిమ స్మరణం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త వేమారెడ్డి

మంగళగిరి: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి, తాడేపల్లి పట్టణాల అధ్యక్షులు, ఆకురాతి రాజేష్, బుర్రముక్క వేణు గోపాలస్వామిరెడ్డిలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్ స్వరూపారాణి, నాయకులు ఈపూరి ఆదామ్, కలకోటి బోయేజు, గుంటి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

❖ మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి కమిషనర్ ఆలీంబాషా పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గాంధీ సేవలను కొనియాడారు. డెప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్, అడిషనల్ కమిషనర్ శకుంతల, డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

❖ ఆరవ బెటాలియన్ ఆవరణలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని నిర్వహించారు. బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ కె.వెంకటేశ్వర్లు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

❖ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు పూలమాలలు వేసి, ఘనంగా సీఐ వినోద్‌కుమార్, సిబ్బంది నివాళులర్పించారు. – పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పారేపల్లి మహేష్, ఉప్పాల రాజ్ కిరణ్, ఉడతా శ్రీనివాసరావు, తిరువీదుల కిరణ్, ఆలా శివాజి పాల్గొన్నారు.

❖ పట్టణంలోని మెయిన్ బజార్‌లోని గాంధీ విగ్రహానికి శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల మోహనరావు, నల్లగొండ మల్లికార్జునరావు, బొగ్గవరపు రాము, చాట్ల సుబ్రమణ్యం, ఊట్లపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల నివాళి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజుతో కలిసి గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ బాటలో భారతదేశమే కాక యావత్ ప్రపంచం నడుస్తోందన్నారు. అహింసా మార్గంతో స్వాతంత్య్రాన్ని సాధించి గాంధీ జాతిపిత అయ్యారన్నారు. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జై జవాన్ జై కిసాన్ నినాదం తెచ్చి, నీతి నిజాయితీలకు కట్టుబడి పనిచేశారని చెప్పారు. నాయకులు సింకా గంగాధర్, మేడా వెంకటేశ్వరరావు, ముదిగొండ ప్రకాష్, బత్తుల దాసు, అప్పికట్ల సంపూర్ణ పార్వతీ, చిలుకోటి శ్రీనివాస్ మధు, కూరగంటి ఉదయరాజు తదితరులు పాల్గొన్నారు.

❖ మహాత్మా గాంధీ జయంతిని దుగ్గిరాలలో బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్ పేట సెంటర్‌లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గుంటూరు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చుండూరు ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ.. మోహనదాస్ కరంచంద్ గాంధీ అక్టోబర్ 2, 1869లో పోర్ బందర్‌లో జన్మించారని, 19 సంవత్సరాల వయసులో న్యాయశాస్త్ర విద్యాభ్యాసానికి ఇంగ్లాండ్ వెళ్లారని చెప్పారు. ఆయన జీవితంలో అత్యధిక ప్రభావం చూపిన గ్రంథం భగవద్గీత అని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు పసుపులేటి గణేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు భాస్కర్, వెంకటేశ్వరరావు, తుమ్మెపల్లి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడవాలి

ఫిరంగిపురం: గాంధీజీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం గాంధీజీ చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, జి.చంద్రం, డి.సురేష్, షేక్. అబ్దుల్ గఫార్, చేవూరి రామమోహన్‌రెడ్డి, బి.అంజిరెడ్డి, పి.చిన్న, ఎం.సుధాకర రెడ్డి, హేమలతారెడ్డి, బ్రహ్మయ్య, ఇబ్రాయిల్, టి.గోవిందయ్య, శంకరరెడ్డి, చిట్టా వాసు, గోవింద్ పాల్గొన్నారు. కొండమెట్ల బజారులోని ఆర్యవైశ్య వీధిలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వి.హరిబాబు, ఆర్.నారాయణ, పూర్ణ, మల్లెల అనిత, పి.దివ్య, అప్పారావు పాల్గొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో గాంధీ చిత్రపటానికి హెచ్‌ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామంలోని సచివాలయం వద్ద గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు షేక్. ఖాసింషాహిద్, సర్పంచ్ గంధూళి ఆదంబీ, షేక్. ఖాజావలి, షేక్. షరీఫ్, చిన్న సుబాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ జీవితం స్ఫూర్తిదాయకం

పాములపాడు(తాడికొండ): గాంధీ మహాత్ముడి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని పాములపాడు సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ అన్నారు. సచివాలయంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకుడు పరుచూరి నారాయణ, 2వ వార్డు మెంబర్ సుశీల దంపతులు బహుకరించిన రూ.30 వేలు విలువ చేసే విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. నారాయణ దంపతులు సమాజ సేవలో ముందుండటం అభినందనీయమన్నారు. ఎంపీటీసీ నల్లమోతు రామాంజనేయులు, పరుచూరి సాయి కిరణ్, పరుచూరి మౌళి కిషోర్ పాల్గొన్నారు.

గాంధీజీ మార్గం అనుసరణీయం



సెయింట్ ఆన్స్ పాఠశాలలో నివాళులర్పిస్తున్న సిస్టర్ నిర్మలామేరి



విగ్రహావిష్కరణ చేస్తున్న సర్పంచ్ శివరామకృష్ణ, నారాయణ



మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి కమిషనర్ నివాళి

తాడికొండ: ఎంపీడీవో సమతావాణి తన కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ ఆచరించిన అహింసా మార్గం యావత్ ప్రపంచానికి గొప్ప సందేశమన్నారు. కార్యాలయ ఏవో చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆరవ బెటాలియన్‌లో గాంధీ చిత్రపటానికి కమాండెంట్ వెంకటేశ్వర్లు నివాళులు



పోలీస్ స్టేషన్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐ వినోద్‌కుమార్



మెయిన్ రోడ్డులోని గాంధీ విగ్రహానికి సేవా సమితి ప్రతినిధుల నివాళి



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేశన శంకరరావు, సంఘం నాయకులు



తాడేపల్లిలో గాంధీ, శాస్త్రిల చిత్రపటాలకు వైఎస్సార్ సీపీ నేతల నివాళి



గాంధీ చిత్రపటానికి మార్పుల శివరామిరెడ్డి, నాయకుల నివాళి

హ్యాండిల్ లాక్..నో సేఫ్

- రాత్రిళ్లు ఇంటి ముందు ఉంచిన బైకుల చోరీ
- హ్యాండిల్ లాక్ వేసినా.. చాకచక్యంగా దొంగతనం
- వారంలో మూడు చోరీలు.. తాజాగా మరొకటి
- పోలీసులపైన నమ్మకం కోల్పోయిన బాధితులు
- ఫిర్యాదు ఇవ్వడానికి కూడా నిరాసక్తి



హ్యాండ్‌లాక్ విరగ్గొట్టి ద్విచక్రవాహనాన్ని తీసుకువెళుతున్న దొంగలు

తాడేపల్లిరూరల్: ద్విచక్ర వాహనాలను ఇంటి ముందు రోడ్డుపై పార్కింగ్ చేసి, హ్యాండిల్ లాక్ వేసినా చోరీలు తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున ఇంటి ముందు పార్క్ చేసి, హ్యాండిల్ లాక్ వేసిన ద్విచక్ర వాహనాన్ని ఇద్దరు దొంగలు చాకచక్యంగా దొంగిలించారు. వారు దొంగిలిస్తున్న చిత్రాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ముందుగా ఇద్దరు యువకులు మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో పోలకం పాడులోని సంజీవయ్య నగర్ క్వారీ ప్రాంతంలోకి నడుచుకుంటూ వచ్చారు. అక్కడ పదుల సంఖ్యలో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు పార్క్ చేసి ఉన్నాయి. కొత్తగా కనిపించిన ఓ స్కూటీని ఎంచుకున్నారు. దానికి హ్యాండిల్ లాక్ వేసి ఉండడంతో హ్యాండిల్‌ను అటూఇటు ఐదు సార్లు తిప్పగానే హ్యాండిల్‌కు ఉన్న లాక్ ఊడిపోయింది. వెంటనే ఒక యువకుడు చుట్టుపక్కల నాలుగు రోడ్ల కూడలిలో ఎవరన్నా ఉన్నారా.. అని గమనిస్తుండగా మరో యువకుడు ఆ ద్విచక్ర వాహనాన్ని దొంగిలించుకుపోయాడు. ఇదే ప్రాంతంలో గత వారం రోజుల్లో మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ఇద్దరు ఫిర్యాదు చేయగా మరొకరు ఫిర్యాదు చేసినా.. ప్రయోజనం ఉండదని పోలీసులను ఆశ్రయించలేదు. మూడు ద్విచక్ర వాహనాలను ఒకే తరహాలో చోరీ చేయడం విశేషం. వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేసేవారు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్స్ లాక్ కూడా ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ



కార్మికులకు వస్త్రాలు అందజేస్తున్న చైర్మన్ సాంబశివరావు

తాడేపల్లిరూరల్ : ఉండవల్లి 1, 2 సచివాలయాల్లో పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం గాంధీ జయంతి సందర్భంగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మారుతి ఫౌండేషన్ చైర్మన్ జంగాల వెంకటేష్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు మారుతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశామని తెలిపారు. ఇటీవల వరదల సమయంలో పారిశుద్ధ్య కార్మికులు సెలవు తీసుకోకుండా తమ సేవలను సక్రమంగా నిర్వహించారని గుర్తుచేసుకున్నారు. వారి సేవలు వెలకట్టలేనివని, తమ వంతుగా నూతన వస్త్రాలు అందజేసి, వారిని సత్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి ఫౌండేషన్ వైస్ చైర్మన్ జంగాల వెంకటేష్, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు సిగిరిశెట్టి రాజా రమేష్, లింగంశెట్టి కిషోర్ కుమార్, దొప్పలపూడి జ్యోతిబస్, రాయపూడి కిరణ్, లాం సురేష్, కూనపరెడ్డి రమేష్, సోమారావు, సింగంశెట్టి శ్రీనివాసరావు, చైతన్య, ప్రశాంత్, లాం మహేష్, సిగిరిశెట్టి లీలాకృష్ణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆవరణలో సిట్టింగ్



ఆవరణలో తాగి పడవేసిన మద్యం సీసాలు

తాడికొండ: తుళ్ళూరు పీహెచ్‌సీ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఆవరణలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో పాటు పర్యవేక్షణ కొరవడటంతో రాత్రిళ్లు మందు బాబులు తమ అడ్డాగా చేసుకుంటున్నారు. మద్యం సేవించి సీసాలను ఆవరణలో పడేస్తున్నారు. చీకటి మయంగా ఉండటంతో కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు కూడా వాడుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దీనికి అడ్డుకట్ట వేసి, రాత్రిళ్లు పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దసరా ఉత్సవాల్లో ఉండవల్లి కళాకారులు



తాడేపల్లిరూరల్ : విజయవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపై జరిగే దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతి సంవత్సరం ఆనవాయితీగా విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి అమ్మవారికి వస్త్రాలను సమర్పిస్తారు. బుధవారం విజయవాడలోని పోలీస్ ఉన్నతాధికారులు అమ్మవారికి నూతన వస్త్రాలను సమర్పించేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఉండవల్లికి చెందిన నాట్యతరంగిణి నిర్వాహకులు ఉషానాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు కూచిపూడి నృత్యాలను నిర్వహించారు. విద్యార్థుల కూచిపూడి నృత్యం అనంతరం అమ్మవారికి నూతన వస్త్రాలను అందజేశారు.

దసరా ఉత్సవాలకు సిద్ధం



మంగళగిరి: దసరా శరన్నవ రాత్రి మహోత్సవాలకు మంగళగిరి పట్టణంలోని ఆలయాలు ముస్తాబు చేస్తున్నారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు పట్టణంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం), పాత మంగళగిరి జాతీయ రహదారి వెంట ఉన్న కనకదుర్గ ఆలయం, కోర్టుల వద్ద కల అఖిలాండేశ్వరి ఆలయం , రాజీవ్ గృహ కల్పరోడ్డులోని కనకదుర్గ ఆలయాలతో పాటు పట్టణంలోని వివిధ ఆలయాలను కమిటీ నిర్వాహకులు అలంకరించారు.

కబ్జా స్థలాన్ని విడిపించండి

ప్రజా దర్బార్‌లో మంత్రి లోకేష్‌కు వినతులు



వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేష్

తాడేపల్లిరూరల్ : రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగం పేరుతో మోసం చేశారని తాడేపల్లికి చెందిన జ్యోతుల మహేష్‌బాబు వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న తన కుమారుడికి పెన్షన్ అందించాలని మహానాడుకు చెందిన జి.రవీందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న తనకు పెన్షన్ అందజేయాలని మంగళగిరికి చెందిన ఉష వినతిపత్రం ఇచ్చింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న తనకు వైద్య సాయం అందించి, ఆదుకోవాలని గుంటూరుకు చెందిన షేక్ షబీరా విజ్ఞప్తి చేశారు. మంగళగిరి బైపాస్ వద్ద తను కొనుగోలు చేసిన 380 చదరపు గజాల స్థలాన్ని స్థానిక నాయకులు కబ్జా చేశారని, ఆ స్థలాన్ని తనకు చెందే విధంగా చర్యలు తీసుకోవాలని గుంటూరు భరత్ పేటకు చెందిన ఎం.వెంకట వీరాజీ మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన వినతి పత్రాలను పరిశీలించి, సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

నేడు ప్రజా దర్బార్ రద్దు

మంత్రి నారా లోకేష్ నివాసం ఉండవల్లిలో నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని గురువారం రద్దు చేస్తున్నట్లు, తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారో పత్రికాముఖంగా తెలియజేస్తామని ఆయన కార్యాలయ సిబ్బంది బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరిహారం రూ.25 వేలు ఇవ్వాలి



పొలాలను పరిశీలిస్తున్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : అధిక వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం చిర్రావూరు గ్రామంలో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. లంక పొలాల్లో విద్యుత్ మోటార్లు రోజుల తరబడి నీళ్లల్లో ఉండడం వల్ల మరమ్మతులకు గురై.. సుమారు రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు అవుతోందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఇది అధిక భారం అయ్యిందన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం రూ.10 వేలు ప్రకటించినప్పటికీ అది కూడా కొంతమంది రైతులకే అందిందన్నారు. తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పొలాలను పూర్తిగా పరిశీలించి, ఎకరాకు రూ.25 వేలు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, బొప్పన గోపాలరావు, రామకోటి పాల్గొన్నారు.

కార్పొరేషన్ పరిధిలో 19 మద్యం దుకాణాలు

– ప్రొహిబిషన్ ఎండ్ ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 19 మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు టెండర్లు వేయవచ్చన్నారు. ఏ దుకాణం కొరకు.. ఏ ప్రాంతం వారు టెండర్లు వేస్తున్నారు అనేదానికి ఓ నంబరు ఇవ్వడం జరుగుతుందన్నారు. టెండర్లకు ఆన్‌లైన్ ద్వారా డీడీల రూపంలో దరఖాస్తులు చేయవచ్చన్నారు. చెల్లించిన నగదు నాన్ రిఫండబుల్ అన్నారు. టెండర్లను గుంటూరు, పల్నాడు కలెక్టర్ల పర్యవేక్షణలో తెరవబడుతాయన్నారు. కార్యక్రమంలో అధికారులు అరుణకుమారి, మారయ్యబాబు, వీరాంజనేయలు పాల్గొన్నారు.